# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం 23
జనవరి 2025

తెలంగాణ ప్రాంతీయం

పేజీలు
8


## సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి




2

## ప్రాణంతీసిన

# వివాహేతర సంబంధం

నడిరోడ్డుపై ఆటోడ్రైవర్ హత్య

హన్మకొండలో పట్టపగలే దారుణం

కత్తితో విచక్షణారహితంగా దాడి

మృతుడు మడికొండకు చెందిన మాచర్ల రాజ్‌కుమార్

పోలీసుల అదుపులో నిందితుడు ఏనుగు వెంకటేశ్వర్లు

నిందితుడు, మృతుడు ఇద్దరూ ఆటోడ్రైవర్లే..

2లో



హనుమకొండలో దారుణం జరిగింది. వివాహేతర సంబంధం ప్రాణంతీసింది. పట్టపగలే నడిరోడ్డుపై ఆటోడ్రైవర్ హత్య కలకలం రేపింది. అదాలత్ జంక్షన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాజీపేట మండలం మడికొండకు చెందిన మాచర్ల రాజ్‌కుమార్‌ను మరో ఆటో డ్రైవర్ ఏనుగు వెంకటేశ్వర్లు విచక్షణా రహితంగా కత్తితో పొడిచి చంపేశాడు. విషయం తెలిసిన వెంటనే సుబేదారి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు.

## సంచలనాల వార్తలకు కేరాఫ్ అడ్రస్

# నినాదం దినపత్రిక

### నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ పర్ణిక రెడ్డి

### ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 'నినాదం' క్యాలెండర్ ఆవిష్కరణ





**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి 22(నినాదం న్యూస్):** నారాయణపేట జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ పర్ణిక రెడ్డి చేతుల మీదుగా నినాదం పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ అంగరంగ వైభవంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి మాట్లాడుతూ నినాదం దినపత్రిక పలు సంచనాల వార్తలు ప్రజల ముందుకు తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. అలాగే నీతి నిజాయితీగా నిజాలు వెలుగు వెలికితీస్తూ ఉన్నందుకు నినాదం పత్రిక జిల్లా ప్రతినిధిని అభినందిస్తూ, నినాదం యాజమాన్యానికి నూతన సంవత్సరం, సంక్రాంతి, గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సామాజిక సేవ కార్యకర్త, భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె రాజ్ కుమార్ రెడ్డి, వారి అనుచరుల మధ్య పెద్ద ఎత్తున నినాదం పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఆయన మాట్లాడుతూ నినాదం పత్రిక మరియు యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి, మాధవరెడ్డి, బోయ రమేష్, వెంకటేష్ గౌడ్, ప్రభంజన్ రావు, సంతోష్, మారుతి, మాధవ్, అప్పిరెడ్డిపల్లి రాము, ఆకుల బాలప్ప అడ్వకేట్, రుద్ర రెడ్డి, గంగు మేస్త్రి, దత్తు తదితరులు పాల్గొన్నారు.




## అర్హులందరికీ ప్రభుత్వ

# పథకాలు అందించాలి

### కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**రంగారెడ్డి, జనవరి 22 (నినాదం న్యూస్):** ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హత ఉన్నవారందరికి అందేలా అధికారులు అందరూ సమిష్టిగా పని చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో 8వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈ నెల 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు నాలుగు రోజులు ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల

మిగతా2లో



## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి

(మొదటిపేజీ తరువాయి..)

పంపిణీ మరియు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేయడం జరిగిందని ఆ వెరిఫికేషన్ జాబితాను గ్రామ, వార్డు సభలలో సభ్యులకు వినిపించి అనర్హులు మరియు అర్హత ఉండి జాబితాలో లేని వారి గురించి సభలలో ఏర్పాటు చేసిన కౌంటర్లో దరఖాస్తులను స్వీకరించి మళ్లీ ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి తుది జాబితాను రూపొందించడం జరుగుతుంది అని అన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములను గుర్తించి రైతుభరోసా అందించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే కొత్త రేషన్ కార్డుల జారీకి మరియు కార్డులో మార్పులు చేర్పుల కోసం ప్రజాపాలన కార్యక్రమం మరియు సోషియో ఎకనమిక్ సర్వే ద్వారా సేకరించిన డాటా ఆధారంగా దరఖాస్తు చేసుకున్న వారి జాబితా సిద్ధం చేయడం జరిగిందని ఆ జాబితాలో అభ్యంతరాలు మరియు అర్హత ఉండి జాబితాలో పేర్లు లేని వారు సభలలో ఏర్పాటు చేసిన కౌంటర్ లో దరఖాస్తు చేసుకోవాలని గ్రామ,వార్డు సభల సమావేశానికి రాని వారు మండల కేంద్రాలు, మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఇల్లు లేని వారిలో సొంత ఇంటి జాగా ఉండి కొంత మంది సొంత ఇంటి జాగా లేని వారు మరియు నివాసానికి యోగ్యం కానీ ఇండ్లలో ఉంటున్న వారు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి లిస్టు తయారు చేయడం జరిగిందని ఆ లిస్టులో పేరు లేని వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. గ్రామ, వార్డు సభలో చదివే లిస్టులో పేర్లు లేని వారు ఎవరు ఆందోళన చెందకుండా గ్రామ,పట్టణ సభలు మరియు మండల కేంద్రాల్లో, మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అధికారులందరు సమిష్టిగా పని చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ వార్డు సభలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, మహేశ్వరం తహశీల్దార్ సైదులు, తుక్కుగూడ మున్సిపల్ చైర్ పర్సన్ హేమలత రాజు, వైస్ ఛైర్మన్ వెంకట్ రెడ్డి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

- సిపిఎం మండల కార్యదర్శి గ్యానం వాసు




**వరంగల్,జనవరి22,(నినాదం న్యూస్):** ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సిపిఎం నాలుగవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి గ్యానం వాసు కోరారు బుధవారం నాడు స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణంలో మహాసభల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారం లోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మహాసభలలో చర్చించనున్నట్లుగా ఆయన తెలిపారు పేద ప్రజలపై భారాలు మోపుతూ మన వైపు దేశంలో మతోన్మాద భావజాలాన్ని పెంపొందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మతోన్మాద సమస్యపై పరిష్కారానికి లోతైన చర్చలు ఈ మహాసభలో జరుపుతామని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆర్ గ్యారంటీ స్కీములు అమలు చేస్తామని చెప్పి కాలయాపన చేస్తుందన్నారు గత రెండు రోజులుగా జరుగుతున్న గ్రామసభలలో అర్హులైన లబ్ధిదారుల పేర్లు కనిపించడం లేదని గ్రామసభలు వద్ద ప్రజలే ఆందోళనకు దిగుతున్న సంఘటన ఎదురవుతున్నాయని ఎద్దేవా చేశారు ఈ రాష్ట్ర మహాసభలకు సిపిఎం అఖిలభారత కోఆర్డినేటర్ ప్రకాష్ కారత్ పార్టీ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, బృందాకరత్, విజయ్ రాఘవన్ హాజరవుతారని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కట్ల నరసింహాచారి మండల కమిటీ సభ్యులు చిట్టెం ఆదినారాయణ తోట నాగేశ్వరరావు సాధనపల్లి దేవి బొగటా సాంబి బొగటా విజయకుమార్ డర్రా ఆనందు గుండమల్ల సాగర్ జీవన్ తదితరులు పాల్గొన్నారు

# ప్రాణంతీసిన వివాహేతర సంబంధం

**వరంగల్ బ్యూరో (నినాదంన్యూస్):** హనుమకొండలో దారుణం జరిగింది. వివాహేతర సంబంధం ప్రాణంతీసింది. పట్టపగలే నడిరోడ్డుపై ఆటోడ్రైవర్ హత్య కలకలం రేపింది. అదాలత్ జంక్షన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాజీపేట మండలం మడికొండకు చెందిన మాచర్ల రాజ్‌కుమార్‌ను మరో ఆటో డ్రైవర్ ఏనుగు వెంకటేశ్వర్లు విచక్షణా రహితంగా కత్తితో పొడిచి చంపేశాడు. విషయం తెలిసిన వెంటనే సుబేదారి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఒకే మహిళతో ఇద్దరు వివాహేతర సంబంధంపెట్టుకోగా, వీరి మధ్య తలెత్తిన వివాదం కారణంగానే హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఓవైపు వ్యక్తి దారుణ హత్యకు గురవుతుంటే చుట్టూ ఉన్న జనం మాత్రం చోద్యం చూస్తూ నిలబడ్డారు. పైగా హత్య జరిగే దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించడం గమనార్హం.

**విచక్షణారహితంగా..**

నిత్యం ఎంతో రద్దీగా ఉండే హైదరాబాద్ – వరంగల్ ప్రధాన హైవే వద్ద డీమార్ట్ సమీపంలో



ఆటో డ్రైవర్ రాజకుమార్ ఆటోలో ఉన్న సమయంలో ఏనుగు వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకున్నాడు. వెంటనే తనతో తెచ్చుకున్న కత్తితో రాజ్‌కుమార్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆటోడ్రైవర్ కడుపులో దాదాపు 15 సార్లు కత్తితో పొడిచాడు. దీంతో అతడు అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. పక్కనే ఉన్న వ్యక్తులు ఆపేందుకు ప్రయత్నించినప్పటికీ సదరు వ్యక్తి.. ఆపకుండా పదేపదే పొడిచాడు. రాజ్‌కుమార్ కిందపడినప్పటికీ వదలకుండా చివరకు గొంతులో కూడా కత్తితో పొడిచాడు. దీంతో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఆపై నిందితుడు వెంకటేశ్వర్లు వెంటనే అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటన హనుమకొండలో తీవ్ర కలకలం రేపింది.

**ఇదే కారణమా..**

ఓ మహిళ విషయంలో ఇద్దరి మధ్య తలెత్తిన వివాదమే హత్యకు కారణంగా ప్రాథమికంగా తెలుస్తోంది. మహిళతో రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. ఇదే క్రమంలో ఇద్దరి మధ్య మాటమాట పెరిగి రాజ్ కుమార్‌ను వెంకటేశ్వర్లు హత్య చేసినట్లు తెలుస్తోంది. స్థానికుల సమాచారం మేరకు సుబేదారి పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరించారు. నిందితుడి కోసం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు, మృతుడు ఇద్దరు ఆటో డ్రైవర్లే. ఎప్పటికీ రద్దీగా ఉండే ప్రాంతంలో, జిల్లా కోర్టుకు కూతవేటు దూరంలోనే ఈ ఘటన జరగడం సంచలనం రేపింది.

# క్రీడాపోటీల ద్వారా పోలీసులలో సమిష్టితత్వం



- ఘనంగా ముగిసిన రాచకొండ కమిషనరేట్ ఆరవ ఎడిషన్ వార్షిక స్పోర్ట్స్ మీట్-2025
- సిబ్బంది రెట్టించిన ఉత్సాహంతో సమర్ధవంతంగా పనిచేయాలి
- ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి
- రాచకొండ పోలీసులకు మానసికోల్లాసాన్ని అందించడమే పోలీస్ స్పోర్ట్స్ మీట్ లక్ష్యం
- సీపీ సుధీర్ బాబు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,జనవరి22,(నినాదం న్యూస్):** సరూర్ నగర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన ఆరవ ఎడిషన్ రాచకొండ పోలీస్ కమిషనరేట్ వార్షిక స్పోర్ట్స్ మీట్–2025 క్రీడా పోటీలు బుధవారం ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లలతో కూడుకున్నదని తమ కర్తవ్య నిర్వహణలో భాగంగా రేయింబవళ్లు పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. క్రీడలు వ్యక్తుల మానసిక శారీరక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని, ఈ క్రీడా పోటీల నిర్వహణ ద్వారా పోలీసులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. పోలీసులు స్వతహాగా చక్కటి ఫిట్ నెస్ తో క్రీడా సామర్థ్యం కలిగి ఉంటారని, 1956 జాతీయ ఫుట్ బాల్ జట్టులో ముగ్గురు హైదరాబాద్ పోలీసు అధికారులు ఉండడం మనకు గర్వకారణం అని గుర్తు చేసారు. విధి నిర్వహణలో బిజిగా ఉన్నప్పటికీ వారానికి కనీసం మూడు గంటల పాటు క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ శాంతిభద్రతల నిర్వహణలో మరియు నేర నియంత్రణలో జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉందని మరింత అంకిత భావంతో పనిచేస్తూ ఆ మంచిపేరును కొనసాగించాలని సూచించారు. ఈ ముగింపు వేడుకలలో రాచకొండ కమిషనర్ శ్రీ సుధీర్ బాబు మాట్లాడుతూ మూడు రోజులపాటు



సాగిన రాచకొండ పోలీస్ కమిషనరేట్ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొన్న అన్ని జట్లను విజేతలను ఆయన అభినందించారు. తమ విధి నిర్వహణలో భాగంగా ఎన్నో రకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటూ సమర్ధవంతంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న పోలీసులకు మానసికోల్లాసాన్ని అందించే లక్ష్యంతో ఈ రాచకొండ పోలీస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. రాచకొండ అన్ని జోన్లు, వివిధ పోలీసు విభాగాల నుంచి 25 క్రీడా విభాగాల్లో మొత్తం ఎనిమిది జట్లు, 1000 మంది పోలీసు క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, ఫుట్ బాల్, రన్నింగ్, చెస్, బ్యాడ్మింటన్ వంటి పలు రకాల ఇండోర్, ఔట్ డోర్ క్రీడా పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. పోలీసు సిబ్బందితో పాటు రాచకొండ కమిషనరేట్ మినిస్టీరియల్ సిబ్బంది ఈసారి కూడా ఉత్సాహంగా ఈ క్రీడాపోటీలలో అభినందనీయం అని పేర్కొన్నారు. శాంతిభద్రతల నిర్వహణలో సిబ్బందికి నాయకత్వం వహించడంతోపాటు వారి సంక్షేమానికి కూడా అధిక ప్రాధాన్యం ఇస్తామని ఈ సందర్భంగా ప్రత్యేకంగా పేర్కొన్నారు. క్రీడా పోటీలలో పొందిన ఆనందంతో సిబ్బంది మరింత ఉత్సాహంతో మరింత సమర్ధవంతంగా పని చేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపి యాదాద్రి రాజేష్ చంద్ర ఐపీఎస్, డిసిపి ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డిసిపి మల్కాజ్గిరి పద్మజ ఐపిఎస్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, డిసిపి మహేశ్వరం సునీత రెడ్డి, డిసిపి ఎస్ఓటి 1 రమణారెడ్డి, డిసిపి ఎస్ఓటి 2 మురళీధర్, డీసీపీ ట్రాఫిక్ శ్రీనివాస్, డిసిపి అడ్మిన్ ఇందిర, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, డిసిపి ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, పలువురు అదనపు డీసీపీలు, ఏసిపిలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కృషి విజ్ఞాన కేంద్రం స్థల పరిశీలన



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జనవరి 22(నినాదం న్యూస్)** కొమురం భీం ఆశీర్వాద్ జిల్లా కౌటాల మండలంలోని కనికి శివారులో బుధవారం సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు, ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారులు కృషి విజ్ఞాన కేంద్రం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ఐసిఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్) ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వారి సహకారంతో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేయడం జరిగిందని, స్థల సేకరణ తర్వాత కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉద్యాన పంటలు, వ్యవసాయ పంటలు, చేపల పెంపకం మరియు పశు పోషణకై మారుమూల ప్రాంతాల రైతులకు కేవీకే ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి విజ్ఞాన కేంద్రాలు లేని జిల్లాలలో కొత్తగా కెవికే లను ఏర్పాటు చేస్తుందని, తద్వారా రైతులకు విత్తనాలు మరియు వ్యవసాయ సలహాల విషయంలో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా.శ్రీనివాస్, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మండల అధ్యక్షులు కుంచాల విజయ్, రవీంద్రనాథ్, మాజీ ఎంపిటిసి దుర్గం మోతిరాం, శివరాం, తిరుపతి, రాజ్ కుమార్, కమలాకర్, వెంకటేష్, అశోక్, శ్రీను, వసంత్, శంకర్, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వినియోగదారుల సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జనవరి 22(నినాదం న్యూస్) :** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికే విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక ఏర్పాటు చేశామని నిజామా బాద్ సిజిఆర్ఎఫ్ చైర్మన్ ఎరుకుల నారాయణ అన్నారు. బుధవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కౌటాల, బెజ్జూరు, చింతలమానేపల్లి, సిర్పూర్, పెంచికల్పేట విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక లో ఆయన మాట్లాడారు. వివిధ మండలాల నుంచి 15 ఫిర్యాదులు వచ్చాయని, అందులో కొన్నింటిని సత్వరమే పరిష్కరించామని ఆయన తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సి జి ఆర్ ఎఫ్ కమిటీ సభ్యులు రామకృష్ణ, లకావత్ కృష్ణ, మద్రిపల్లి రాజా గౌడ్, ఎస్ఈ శేషారావు, డిఈ నాగరాజు, ఏడిఈ రాజేశ్వర్, ఏఈలు ప్రేమ్ కుమార్, ఇర్ఫాన్, అంజన్ కుమార్, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు

**చేవెళ్ల జనవరి 22(నినాదం న్యూస్):** జాతీయ రహదారి భద్రతా మాస ఉత్సవాలలో భాగంగా చేవెళ్ల నియోజ కవర్గం షాబాద్ మండల పరిధిలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్, గర్ల్స్ విద్యా ర్థులు ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఎమ్ఈఓ మాట్లాడుతూ విదర్థులకు రోడ్డు భద్రతపై అవగాహనా కల్పించారు. రోడ్డు బద్రత నియమాలను పాటించి, వారి గమ్యస్థలాన్ని సురక్షితంగా చేరికోవచ్చని అని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రకార్డులు పట్టుకొని నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ డి లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు గోవిందు, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి కుట్ర

### సీపీఐ శత జయంతి ఉత్సవాలు




**మంచిర్యాల ప్రతినిధి, జనవరి 22(నినాదం న్యూస్):** భారత రాజ్యాంగం మార్చేందుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు మరియు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సిపిఐ 100 సంవత్సరాల శతజయంతి ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యలపై నిత్యం పోరాటాలు చేసేది, ప్రజలకు కష్టం వస్తే అండగా నిలిచేది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలో సెక్యులరిజం అనే పదాన్ని మార్చాలంటున్నారని పేర్కొన్నారు. సెక్యులరిజం అంటే అందరికీ సమానత్వమని అర్థమని, దానికి ఆర్ఎస్ఎస్, బిజెపి వ్యతిరేకంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. దేశంలో నిరంకుశత్వం తద్వారా వారి ఏజెండా అయినా మతోన్మాదం, హిందూయిజం ద్వారా ఈ దేశాన్ని ఏలాలనే లక్ష్యంతో మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సోషలిజం, సెక్యులరిజం ఉండాలని కోరుకుంటున్న కమ్యూనిస్టులు ఈ దేశంలో ఉండకూడదని కుట్రలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, %ఞా×% జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, ఖలిందర్ అలీ ఖాన్ ,జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, బొల్లం పూర్ణిమ, చిప్ప నరసయ్య,లింగం రవి ,మిట్టపల్లి శ్రీనివాస్ ,కారుకూరి నాగేష్, ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు ముస్కె సమ్మయ్య, బాజీ సైదాలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన పోస్టర్‌ను చింపిన టిఆర్ఎస్ నేత





- ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్ కుమారుడు
- వార్డు సభను అడ్డుకోవడం హేయమైన చర్య
- కాంగ్రెస్ నేత మొలుగూరి సదయ్య

**జమ్మికుంట, జనవరి 22 (నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ వార్డు సభలలో ప్రజాపాలన ముఖ్యమంత్రికి సంబంధించిన పోస్టర్ను జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 14వ వార్డుకు చెందిన కౌన్సిలర్ భోగం సుగుణ కుమారుడు భోగం వెంకటేష్ చింపివేసి డ్రైనేజీలో పారేశాడు. ప్రజా పాలన పేరిట సామాన్య ప్రజలను మోసం చేస్తున్నారంటూ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అదేవిధంగా ఇల్లందకుంట మండల కేంద్రంలోని సిరి సేడు గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ ఎస్ పార్టీలకు చెందిన నాయకులు పోటాపోటీగా ఒకరికొకరు వాగ్వివాదాలకుదిగారు. జమ్మికుంట పట్టణంలోని పలు వార్డులలో కౌన్సిలర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది ఏమీ లేదంటూ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొలుగూరి సదయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని అడ్డుకోవడమే కాకుండా ఫ్లెక్సీ ని చింపి డ్రైనేజీలో పడవేయడం సరైనది కాదని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి అడ్డుకోవడం సరైనది కాదన్నారు.బీ ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క రేషన్ కార్డు, ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదని పేర్కొన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఏ ఒక్క అభివృద్ధి పని చేయలేని గత ప్రభుత్వ నాయకులు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక పోతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని ప్రజలు అధికారులతో సహకరించి సమస్యను పరిష్కరించు కోవాలని లిస్టులో పేరు రాకపోతే తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

# జాతీయ స్థాయి ఒలంపియాడ్లో అల్ఫోర్స్ విద్యార్థులకు అత్యుత్తమ పతకాలు




**కరీంనగర్, జనవరి 22(నినాదం న్యూస్):** విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే సామాజిక అవగాహన పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉండాలని తద్వారా వారు అందులో నిపుణులు అవుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల అభినందన సభ కు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వాటిలోని అంశాలను సమగ్రంగా విద్యార్థులకు విశ్లేషాత్మకంగా తెలుపాలని తద్వారా వివిద అంశాల పట్ల అవగాహన పెరుగుతుందని మరియు పోటీ పరీక్షలలో పాల్గొనడానికై విశ్వాసం కల్గుతుందని చెప్పారు. విద్యార్థులకు తరగతిగదుల్లో ప్రతి అంశం గురించి చాలా అవగాహన కల్పిస్తామని మరియు విషయాలను తెలియపర్చడం జరుగుతుందని చెప్పారు. పాఠశాలలో ఇచ్చిన ప్రోత్సాహంతో వివిద పోటీ పరీక్షలకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో యూనిఫైడ్ కౌన్సిల్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి జి.కె. ఒలంపియాడ్లో పాఠశాలకు చెందిన బి. విహార్ 4వ తరగతి, వి. విహాన్ శౌరి 4వ తరగతి, ఎ. అక్షయగ్న 6వ తరగతి, డి. సమ్మితా రెడ్డి, 6వ తరగతి, యం. శివేన్ రెడ్డి, 7వ తరగతి, వి. జయంత్ క్షేత్రజ్ఞ 8వ తరగతి ఇ. ఆరుష్ పటేల్ 9వ తరగతి పతకాలు సాధించి పై చేయి సాధించారని హర్షం వ్యక్తం చేస్తు ప్రాంగణంలో ఏర్పాటుచేసినటువంటి సభలో శుభాభినందనలు తెలియజేశారు.ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందిస్తాం

- లిస్టులో పేరు లేదని ఆందోళన వద్దు
- లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించిన కాంగ్రెస్ నేతలు
- అందరికీ అందుబాటులో ప్రజా ప్రభుత్వం
- హుజురాబాద్ పట్టణ మహిళా అధ్యక్షురాలు యేముల పుష్పలత



**జమ్మికుంట, జనవరి 22 (నినాదం న్యూస్):**రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షురాలు వేముల పుష్పలత తెలిపారు. మంగళవారం ప్రజా పాలన వార్డు సభలో ఇందిరమ్మ ఇల్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు ఇందిరా నగర్ కాలనీలో ప్రకటించిన లిస్టులో రేషన్ కార్డు రాలేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారని ఆమె తెలిపారు. ఈ విషయంపై నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ తో మాట్లాడగా లిస్టులో పేరు రాలేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని సూచించగా బుధవారం అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించామని ఆమె తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యం అవసరం లేదని ఆమె తెలిపారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు



**కరీంనగర్, జనవరి 22(నినాదం న్యూస్):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రచారం లో భాగంగా హుజురాబాద్ లోని పాఠశాలల యజమాన్యం మరియు పట్టభద్రులతో సమావేశమైన పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ, 22 సంవత్సరాలుగా ట్రస్మా అనే సంఘం స్థాపించి సంఘ అధ్యక్షుడిగా ఉంటూ ఎన్నో రకాల ప్రజల సమస్యలపై పోరాడానని అన్ని సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తినని అన్నారు లేనిపోని ఆశలు చూపెట్టి గద్దెనెక్కిన ప్రభుత్వాలు పట్టబద్రులను గాలికి వదిలి వేసిందని అరచేతిలో  వైకుంఠం చూపెట్టి గద్దెనెక్కిన పెద్దమనుషులు తర్వాత ప్రజల పట్ల పట్టభద్రుల పట్ల వారి సమస్యల పట్ల కనీసం తిరిగి చూసే ధోరణిలో కూడా లేరని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నన్ను గెలిపిస్తే పట్టభద్రులకు ఉపయోగపడేలా రిసోర్స్ సెంటర్లు మండలాల వారిగా ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి తోడ్పడుతున్న న్న పట్టభద్రు  చదువుకున్న విజ్ఞులని సమాజంలో సేవా గుణం ఉన్న వారిని గెలిపిస్తే సేవ చేస్తారని వందల కోట్లు వేలకోట్లు ఖర్చుపెట్టి ఆడంబరాలు చేసే వ్యక్తిని నేను కాదని సేవా గుణముతో సేవ చేయాలనే ఆలోచనతో మీ ముందుకు వస్తున్నానని ఆశీర్వదించి శాసన మండలికి పంపిస్తే సమస్యల పట్ల పోరాడుతానని అన్నారు వందల కోట్లు సంపాదించడానికి సంపాదించిన దాచుకోవడానికో రావడం లేదని సమాజ మార్పుకై వస్తున్నానని తనను గెలిపిస్తే మార్పు చేసి చూపెడతానని అన్నారు. కార్యక్రమంలో ట్రస్మా టౌన్ ప్రెసిడెంట్ వకులా భరణం వెంకటేశ్వర్లు, ట్రస్మా వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి,ఈసీ మెంబర్ రాజకుమార్, ప్రసాద్ సందీప్,పండుగ రమేష్ పాల్గొన్నారు.

# కుల గణ సర్వేతో సేకరించిన డేటా ఏమైంది...?

## ఏడాది కింద స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయి..? మూలకు పడేసినట్టేనా..!?

### - బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర



**కరీంనగర్, జనవరి 22(నినాదం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా పాలన పేరిట స్వీకరించిన దరఖాస్తులు ఏమ య్యాయని..? ఇటీవల కుల గణన సర్వే పేరిట స్వీకరించిన డేటా ఏమైందని..? ఏడాదికాలంగా ఎన్ని ప్రజాపాలన అప్లికేషన్లు పరిష్కరించారో చెప్పకుండా మళ్లీ ప్రజా పాలన దరఖాస్తుల పేరిట గ్రామ సభలు నిర్వహించి ఏం చేస్తారని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర ప్రశ్నిం చారు. బుధవారం కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంగా వివిధ పథకాలకు దరఖా స్తులు స్వీకరిం చడం, అర్హులను, లబ్ధిదారులను సంబంధిత కార్యాలయాల చుట్టూ తిప్పిస్తూ జనాలతో ఆటలాడుకుంటుందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రజాపాలన పేరిట దరఖాస్తులను స్వీకరించి వాటిలో ఏ ఒక్కరి అప్లికేషన్ అయిన పరిష్కరించకుండా అటకెక్కించిందన్నారు. మళ్లీ కుల గణన సర్వే పేరిట కుటుంబ పూర్తి డేటాను సేకరించి, ఇందులో కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన వారికి రేషన్ కార్డులను ఇచ్చిందని ఆయ న ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ సర్కార్ రైతు రుణమాఫీ కొందరికే చేసి, రుణమాఫీ కాని రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాల యంలో తిరిగేలా చేసిందని, సంబంధిత వివరాలతో అప్లికేషన్లు తీసుకొని నేటికీ అనేక మంది రైతులకు రుణమాఫీ చేయకుండా గోసపెడుతుందన్నారు. దరఖాస్తులు , ప్రజల డేటాను స్వీకరించి కాంగ్రెస్ ఏడాది కాలంలో సాధించిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే బాహాటంగా ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు, శ్రేయోభిలాషులకే పథకాలు ఇస్తామని బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నప్పుడు దరఖాస్తుల స్వీకరణ ఎందుకని ఆయన ప్రశ్నించారు. అసలైన అర్హులకు, లబ్ధిదారులకు న్యాయం చేయకుండా వాళ్లను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంగా ప్రజల సమస్యలను పరిష్కరించకుండా దరఖా స్తుల స్వీకరంతో టైంపాస్ పాలన కొనసాగి స్తుందని ఆయన ఈ సందర్భంగా తీవ్రంగా విమర్శించారు.

# ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా పాలన

**అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకం - మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి - వార్డులలో రెండవ రోజు కొనసాగిన గ్రామ సభలు**



**జమ్మికుంట, జనవరి 22 (నినాదం న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని పలు వార్డులలో మండలంలోని పలు గ్రామాలలో బుధవారం అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు.జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న కోటి ఆధ్వర్యంలో అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో ప్రజా పాలన సభలు వార్డ్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు రేషన్ కార్డుల విషయంలో కానీ ,ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కానీ, రేషన్ కార్డులో తమ పిల్లల పేర్లు ఎన్నో సంవత్సరా లుగా ఎంట్రీ కాకపోవడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తూ సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పిల్లల పేర్లు రేషన్ కార్డులో రాకపోవడం బాధాకరంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న కోటి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం  ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి  ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్లు కొత్త రేషన్ కార్డు గత ప్రభుత్వ హయాంలో ఇవ్వనటువంటి ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు గత ప్రభుత్వ హయాంలో మీ సేవ కేంద్రాలలో పెట్టుకున్న టువంటి రేషన్ కార్డులో పేర్ల తొలగింపు పేర్లను చేర్చడం దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కొత్త రేషన్ కార్డులు పేర్ల మార్పు చేర్పులు ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది సోషల్ మీడియాలో ప్రభుత్వం మీద బురదజల్లే విధంగా వస్తున్నటువంటి వార్తలు ఎవరు పట్టించుకోవద్దు అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు  రేషన్ కార్డులు తప్పకుండా ఈ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. అర్హులందరికీ అన్ని పథకాలు అందేలా చూస్తామని వారు తెలిపారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్  శేఖర్  శ్రీకాంత్ ఆర్పీ జేరిపోతుల సృజన సిబ్బంది ఉద్యోగులు కోడెం రాజు  దూడపాక  స్వామి అంగన్వాడి టీచర్ స్వప్న  కాంగ్రెస్ నాయకులు దేశిని శ్రీనివాస్ ఎండి సజ్జు ఉడత వెంకటేష్ ఆడెపు దేవరాజ్ ఎండి ఖలీల్ మంద సునీల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని మడిపల్లి అంకుషాపూర్ జగ్గయ్యపల్లి పెద్ద పల్లి గ్రామాలలో జమ్మికుంట మండల తహసిల్దార్ రమేష్ బాబు ఆధ్వర్యంలో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న సంక్షేమ పథకాలను గురించి పూర్తిస్థాయిలో లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు దశలవారీగా అర్హులను గుర్తించడంతో పాటు గ్రామస్తుల అందరి సమక్షంలో గ్రామ సభను నిర్వహించి తుది జాబితాను తయారు చేయనున్నారు. దీనిలో భాగంగా గ్రామాలలో ఇప్పటికీ గుర్తించిన అర్హుల జాబితాను చదవడంతో పాటు  రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లులు లేని వారి వద్ద నుండి దరఖాస్తులను తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని దీనిలో భాగంగా రేషన్ కార్డులను మంజూరు చేయడంతో పాటు అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరుగుతుందని వివరించారు. అర్హులైన వారు లిస్టులో పేర్లు రానంతమాత్రాన బాధపడకుండా దరఖాస్తు చేసుకోవాలని తప్పకుండా ప్రతి ఒక్క అర్హునికి లబ్ధి జరిగేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రమేష్ బాబు స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి అంజిరెడ్డి, ఏఈఓ రాంప్రసాద్, కాంగ్రెస్ నాయకులు ఎగ్గెటి సదానందం మ్యాకమల్ల అశోక్ చిన్నవేన రమేష్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలకు దరఖాస్తుల వెల్లువ

### లబ్ధిదారుల జాబితా లో తమ పేరు లేదని గందరగోళం.. అధికారులతో వాగ్వివాదం








**భీమదేవరపల్లి జనవరి 22 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో రెండవ రోజు ప్రజాపాలన గ్రామసభలు కొనసాగుతున్నాయి. బుధవారం రోజు మాణిక్య పూర్, కొత్తపల్లి,ముల్కనూర్, చంటయ్యపల్లి,ధర్మారం, గట్ల నర్సింగాపూర్, రంగయ్యపల్లి గ్రామాలను గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలలో ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు కొరకు అధికారులు తయారుచేసిన డ్రాఫ్ట్ లిస్టును చదివి వినిపించారు. అనంతరం గ్రామస్తులు ఆ లిస్టులలో తమ పేర్లు రాలేదని అధికారులు తమ ఇంటికి వచ్చి వెరిఫికేషన్ చేసుకున్నారని అధికారులను అడిగారు. ఆ లిస్టులో పేరు లేకపోతే ఇప్పుడు మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెప్పడంతో ఏర్పాటు చేసిన కౌంటర్లో దరఖాస్తులు చేసుకున్నారు. ముల్కనూర్ గ్రామసభలో మండల ప్రత్యేక అధికారి అదనపు డి ఆర్ డి ఓ శ్రీనివాస్ హాజరవగా భీమదేవరపల్లి తహసిల్దార్ ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పూర్ణచందర్ కాంగ్రెస్ నాయకులు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**బిజెపి నాయకుల నినాదాలు**

ముల్కనూర్ గ్రామసభలో పథకాల కొరకు ఒకవైపు దరఖాస్తులు చేసుకుంటుండగా మరోవైపు స్థానిక బిజెపి నాయకులు కొంతమంది రెండు లక్షల పైన రుణమాఫీ చేయాలని నినాదాలు చేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అక్కడినుండి తీసుకెళ్లారు.

## మాదకద్రవ్యాల నియంత్రణపై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**ములుగు ప్రతినిధి, (నినాదం):** మాదకద్రవ్యాల నియంత్రణపై శిక్షణకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతలఅన్వేష్ తెలిపారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 25న కాకతీయ యూనివర్సిటీలో మత్తు, మాదకద్రవ్యాల నియంత్రణపై 25 మంది యువతకు ఏర్పాటు చేయబోయే రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు చేయు వారి వయసు 18 నుండి 29 సంవత్సరాలు లోపు ఉండాలని, ఎంపికైన అభ్యర్థులకు భోజనం, వసతితో పాటు రవాణా భత్యం కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 25, 26న జరిగే ఈ శిక్షణ యువతకు చక్కటి అవకాశం అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసక్తిగల యువత హనుమకొండ న్యూ బస్టాండ్ సమీపంలోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 24 లోపు దరఖాస్తులు సంప్రదించాలని కోరారు.

## సకాలంలో పిల్లలకు టీకాలు ఇవ్వాలి...

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు**



**ములుగు ప్రతినిధి, (నినాదం):** వ్యాధినిరోధక టీకాలు పిల్లలకు సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు అన్నారు. బుధవారం వెంకటాపురం మండలం జవహర్ నగర్ ఉపకేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఒకరోజు ముందస్తు వ్యాధి నిరోధక టీకాలు తీసుకునే పిల్లల బెన్ఫిషరీ లిస్టును తయారు చేసుకొని పిల్లలను టీకాలు ఇచ్చే కేంద్రానికి తీసుకురావాలని ఆశా కార్యకర్తలకు తెలిపారు. జాతీయ టీబి నియంత్రణ కార్యక్రమం, లెప్రసీ కార్యక్రమ అమలు తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్న ఆయన టిబి వ్యాధిగ్రస్తుల నమోదు సంఖ్యను పెంచి రెగ్యులర్గా మందులను వాడేలా చూడాలన్నారు. అలాగే ఇంటింటి సందర్శన చేపట్టి స్పర్శ లేని మచ్చలున్న వ్యక్తులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిబి కీటక జనిత లేప్రోసి నిరోధక ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చంద్రకాంత్, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ



**ఉమ్మడి అదిలాబాద్ బ్యూరో,నినాదం :** పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ గోలేటి గౌరవాధ్యక్షులు కన్నం రాజమల్లు ఆధ్వర్యంలో పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ క్యాలెండర్ ని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మారిన వెంకటేశ్వర్లు ,గుండేటి వీరస్వామి, మారిన చందర్, పొన్న శంకర్ భోగ రవీందర్, హనుమాన్ల సత్యనారాయణ, బూర శ్రీనివాస్ తో పాటు తది తరులు పాల్గొన్నారు.

## కార్మికులకు వేతనాలు..బెన్‌ఫిట్స్ చెల్లించాలి...

**- సీపీఐ ఎంఎల్ రాష్ట్రకార్యదర్శి ప్రసాదన్న**



ములుగు ప్రతినిధి, (నినాదం): రియాన్స్ కార్మికులకు వేతనాలు, ఇతర బెనిఫిట్స్ చెల్లించకుండా ఇతరులకు ఆ ఫ్యాక్టరీని దాఖలు పరచటం చట్టవిరుద్ధమని సీపీఐ ఎంఎల్ రాష్ట్రకార్యదర్శి కామ్రేడ్ ప్రసాదన్న అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంగపేట మండలం కమలాపురం గ్రామంలో సుమారుగా 1978 సంవత్సరములో ఫ్యాక్టరీ బిల్ట్ పరిశ్రమను ప్రారంభించడం జరిగిందని, ఆనాటి నుండి పరిశ్రమలో సుమారుగా 650 మంది కార్మికులు ప్రత్యక్షంగా, మరో 10,000 మంది పరోక్షంగా ఉపాధిని పొందినట్లు ఆయనతెలిపారు. అయితే 2014 సంవత్సరంలో పరిశ్రమకు నష్టం వాటిల్లిందనే సాకుతో యాజమాన్యం లాకౌట్ చేసిందన్నారు. 2015 నుండి2020 వరకు కార్మికులకు వేతనాలు ఇతర బెనిఫిట్స్ చెల్లించకుండా యాజమాన్యం వ్యవహరించిందని, ప్రస్తుతం ఐటిసి వారికి అమ్ముకోవడం జరిగిందన్నారు. ఇటీవలి కాలంలో కార్మికులు అనేకమార్లు ఆందోళనలు చేసి లేబర్ కోర్టులను ఆశ్రయించారని, చివరికి లేబర్ జాయింట్ కమిషనర్ ఇచ్చిన ఆర్డర్లో చెల్లించాల్సిన డబ్బులను కూడా చెల్లించకుండా యాజమాన్యం వ్యవహరించి పూర్తిగా జడ్జిమెంట్లకు భిన్నంగా చట్ట విరుద్ధంగా యాజమాన్యం పాల్పడి కార్మికులకు ద్రోహం చేసిందని ఆయన వాపోయారు. వెంటనే కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలను, పిఎఫ్, గ్రాడివిటీ బెనిఫిట్స్ను చెల్లించిన తర్వాతనే ఇతర పనులు మొదలు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) నాయకులు కామ్రేడ్ పల్లెబోయిన స్వామి, కామ్రేడ్ బానోతు నరసింహ, కామ్రేడ్ నాంపల్లి స్వామి, కామ్రేడ్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు హెల్త్ వెల్నెస్ పై అవగాహన కార్యక్రమం





ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, (నినాదం): కొమురం భీం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే సీతారాం ఆధ్వర్యంలో టీచర్లకు, ఆరోగ్య పర్యవేక్షణ అధికారులకు,ఆరోగ్య విస్తీర్ణ అధికారులకు మరియు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు హెల్త్ వెల్నెస్ ప్రోగ్రాం మీద రెండు రోజులుగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ పని ప్రదేశంలో ఒత్తిడి ఎక్కువగా లేకుండా మానసికంగా ప్రశాంతంగా ఉండటం,ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని సృష్టించడం, ఉద్యోగులు సమిష్టిగా పని భారాన్ని తగ్గించుకునే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించేలా తగు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఉద్యోగులకు తగు సూచనలు చేశారు.

## తిరుమలలో అక్రమంగా శారదాపీఠం నిర్మాణాలు

### చట్ట విరుద్ధ నిర్మాణాలపై ధర్మాసనం ఆగ్రహం

**అమరావతి:** అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను ఉపేక్షించడానికి వీల్లేదని ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. తిరుమలలోని శారదాపీఠం భవన నిర్మాణం విషయంలో ఉన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ భవనం కూల్చివేతకు ఆదేశాలు ఇస్తామని తెలిపింది. తిరుమలలో ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు ఎలా చేపడతారని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ప్రశ్నించింది. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిపితే ఏం జరుగుతుందో ఈ కేసు ఒక ఉదాహరణ కావాలని పేర్కొంది. విశాఖ శారదాపీఠం తిరుమలలో అక్రమ నిర్మాణాలను చేపడుతున్నప్పటికీ తితిదే ఎలాంటి చర్యలు తీసుకోలేదని తిరుమల క్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు, న్యాయవాది తుమ్మా ఓంకార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. గతంలో ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. భవన నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశాలిచ్చింది. ఈ పిల్‌పై బుధవారం మరోసారి విచారణ జరిగింది. శారదాపీఠం భవనాన్ని సీజ్ చేస్తూ తితిదే బోర్డు తీర్మానం చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. బిల్డింగ్ ఎ÷-లాన్ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు ఎలా చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాల కూల్చివేతకు ఆదేశాలిస్తామని పేర్కొంది. కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని శారదాపీఠం తరఫు న్యాయవాది అభ్యర్థించగా.. అందుకు అనుమతిస్తూ తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

# ముగ్గురు మంత్రులకు అవగాహన లేదా?

## సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కనకయ్య ఆరోపణ



**మణుగూరు జనవరి 22( నినాదం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి హామీ కూలీలకు కార్డు ఉంటేనే 12000 చెల్లిస్తాం అనడం ముగ్గురు మంత్రుల అవగాహన లోపమేనని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య ఆరోపించారు. బుధవారం మణుగూరులో సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.......... మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజల అవస్థలు పాలకులు తెలియకుండా ఉన్నాయా అని ప్రశ్నించారు. మేజర్ గ్రామపంచాయతీ గా ఉన్న మణుగూరు పంచాయతీని మునిసిపాలి టీలో చట్ట వ్యతిరేకంగా విలీనం చేశారని ఆయన ఆరోపించారు. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించగా ఇప్పటికీ 20 సంవత్సరాల నుంచి మున్సిపాలిటీలో ఎన్నికలు కూడా నిర్వహించలేని పరిస్థితి ఉందని ఆయన ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులకు అవగాహన రాహిత్యం ఏర్పడిందని ఆయన ఆరోపించారు. మణుగూరు గ్రామపంచాయతీని మునిసిపాలి టీగా మార్చి పేదలకు అందని ద్రాక్ష రసంగా తయారైందని ఆయన ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలో పాత మణుగూరు శివలింగాపురం బాపనుకుంటా రాయి గూడెం కమలాపురం అన్నవరం తదితర గ్రామాలు ప్రజలు మున్సిపాలిటీ పన్నులు కట్టలేక నానా అవస్థలు పడుతున్నారని ఆయన అన్నారు. వారికి ఉపాధి కూలీ కూడా చేసే పరిస్థితి కల్పించడం లేదని ఈ ధమనీయ పరిస్థితి పై ముగ్గురు మంత్రులు ఆలోచించాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పేరుతో పేదలపై భారం మోపుతూ మరింత పేదలుగా మార్చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న ముగ్గురు మంత్రులు మణుగూరు మున్సిపాలిటీ మేజర్ గ్రామపంచాయతీ గా మార్చి, పేదలపై పడే భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. 2005 సంవత్సరంలో అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అవగాహన రాహిత్యానికి మణుగూరు మున్సిపాలిటీ నిదర్శనం అని ఆయన ఆరోపించారు. 1/70 యాక్టిచట్టానికి విరుద్ధంగా గిరిజన ఏజెన్సీ ప్రాంతంలో మణుగూరు మేజర్ గ్రామపంచాయతీ గాను మున్సిపాలిటీ గా విలీనం చేయడం అర్థరహితమని ఆయన ఆరోపించారు. 20 సంవత్సరాలుగా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలు పన్నులు కట్టలేక అధిక భారం మోయలేక గ్రామాలు విడిచి గ్రామపంచాయతీ పరిధిలోకి వలస పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మణుగూరు మున్సిపాలిటీలో ఉన్న ప్రజల సమస్యలను అర్థం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం మణుగూరు మున్సిపాలిటీ రద్దుచేసి మేజర్ గ్రామపంచాయతీ గా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మున్సి పాలిటీ పరిధిలో ఉన్న పేద ప్రజలకు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీలు పనులను కల్పించి అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇల్లు తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నెల్లూరు నాగేశ్వరావు మండల అధ్యక్షుడు సాంబశివరావు నిమ్మల వెంకన్న కొడిశాలు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దుదూ చౌహాన్





**మహేశ్వరం, జనవరి 22 ( నినాదం న్యూస్)** శ్రీ ఉమామహేశ్వర స్వామి వారిని దర్శించుకున్న భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దుదూ చౌహాన్ భక్తుల జటావత్ కిసాన్ నాయక్, రూప్ సింగ్ నాయక్, చంద్రశేఖర్, భారత్ శర్మ, గోవింద భజన మండలి ప్రవీణ్, నవీన్ సభ్యులతో ఉమా మహేశ్వరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీర్వాదంతో దినదిన అభివృద్ధి చెందాలని కొనియాడారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... స్వామివారి ఆశీర్వాదంతో ప్రతి సంవత్సరం జాతర అత్యంత వైభవంగా జరుగుతున్నది, ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని పూజించాలని పేర్కొన్నారు, భక్తుల సహకారంతో ఆలయం దినదిన అభివృద్ధి చెందాలని కొనియాడారు. ప్రధానార్చకులు చైర్మన్ కు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలుకుతూ ఆశీర్వదించారు. ఆయనకుప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో భారత్ గోర్ బంజారా సేవా సమితి రాష్ట్ర మీడియా అధ్యక్షులు జర్నలిస్ట్ సింగ్, భక్తులు సిబ్బంది ప్రధానార్చకులు తదితరులు పాల్గొన్నారు.

# శారీరక దారుడ్యానికి క్రీడలు దోహదం





## ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

**చౌటుప్పల్,జనవరి22 (నినాదంన్యూస్):** మానసిక ఉల్లాసానికి, శారీరక దారుడ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పంతంగి గ్రామంలో రాజన్న సైన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏసీపీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీయడానికి ఇలాంటి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. క్రీడలతో స్నేహబావం పెంపొందుతుందన్నారు. ఈకార్యక్రమంలో సీఐ మన్మథకుమార్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బోయ రాంచందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మాజీ ఉప సర్పంచ్ బోయ అంబేద్కర్, నాయకులు కడగంచి వెంకటేష్, దూడల అశోక్, జాజుల అంజయ్య, చింతల దేవరాజు, మాదగోని అంజయ్య, బోయ నర్సింహ, బీర్ల యాదయ్య, వెలిజాల జగదీష్, బొడిగె ఉపేందర్, నిర్వహకులు బోయ వెంకట్, అంతటి జగదీష్, కడగంచి అన్వేష్, బోయ సంపత్, తూర్పింటి వంశీ, బోయి అరవింద్, బోయరాజు తదితరులు పాల్గొన్నారు.

### బీసీలు ఉద్యమించకపోతే

# భవిష్యత్ లేదు

- పంచాయతీ నుండి పార్లమెంటు దాకా మా వాటా మాకు దక్కాలి
- 6 శాతం కూడా లేని వారికి 10 శాతం రిజర్వేషన్లు
- ఫిబ్రవరి 2న బిసి రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయండి
- బత్తుల సిద్దేశ్వర్ పటేల్



**భీమదేవరపల్లి జనవరి 22 (నినాదం న్యూస్):** బీసీలు ఉద్యమించకపోతే వారికి భవిష్యత్తు లేదని ఈ డబ్బులు రిజర్వేషన్లతో బీసీలు నష్టపోతున్నారని బీసీ రాజకీయ చైతన్య కొరకు సైకిల్ యాత్ర చేపడుతున్న భక్తుల సిద్దేశ్వర పటేల్ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర బుధవారం రోజు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన రాజ్య స్థాపన చేసిన సర్దార్ సర్వాయి పాపన్న పుట్టిన గడ్డ ఆయన ఖిలా షాపూర్ నుండి సైకిల్ యాత్ర చేపడుతున్నామని ఈ యాత్ర ఫిబ్రవరి 2న హనుమకొండ లో జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి సభతో ముగుస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరు శాతం ఉన్న అగ్రవర్ణాలకు అందులో ఒక శాతం ఉన్న అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు 10 శాతం అమలవుతుంటే 60 శాతం ఉన్న బీసీలకు ఇచ్చే రిజర్వేషన్లు ఎంత అని ప్రశ్నించారు. గ్రామపంచాయతీ నుండి పార్లమెంటు దాకా రాజకీయాల్లో బీసీలకు దక్కాల్సిన న్యాయపరమైన వాటవారికి దక్కేవరకు ఉద్యమం ఆపేది లేదని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఫిబ్రవరి 2న జరిగే బీసీల రాజకీయ విధులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### సొంత నిధులతో మట్టిరోడ్డు వేయించిన

# మునుకుంట్ల వెంకటేషంగౌడ్



**చౌటుప్పల్,జనవరి22 (నినాదంన్యూస్):** చౌటుప్పల్ మండలం పీపల్‌పహాడ్ నుండి ఏనగండి తండా వరకు ఉన్న కంకర రోడ్డు వలన రెండు గ్రామాల ప్రజలకు. రైతులకు ,తండా వాసులకి గత 10 సంవత్సరాల నుండి బాధ పడుతున్న గ్రామప్రజల ఇబ్బంది కలగకుండా గమనించిన మునుకుంట్ల వెంకటేశంగౌడ్ సొంత నిధులతో మట్టిని పోయించారు. అలాగే దేవలమ్మ నాగారం నుండి పీపల్‌పహాడ్ గ్రామం వరకు గుంతలుగా ఉన్న రోడ్డుపై మట్టి పోయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు పూలనగారి రమేష్, బీజేపీ మాజీ అధ్యక్షుడు ఉడుగు యాదయ్య, తూర్పునూరి రంజిత్ కుమార్, మాధగోని గాల్లయ్య,సిదుగుళ్ల యాదయ్య ,నూనె సహదేవ్, ఎర్ర ఉపేందర్ పాల్గొన్నారు.

### గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సును
# విజయవంతం చేయండి



**చౌటుప్పల్,జనవరి22 (నినాదంన్యూస్):** ఈనెల 25న గాంధీపార్క్‌లో జరిగే గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాంధారి ప్రభాకర్ కోరారు. బుధవారం చౌటుప్పల్ మండల శాఖ సర్వసభ్య సమావేశానికి వెన్ రెడ్డి సంధ్యారాజు సభాధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభాకర్ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. పురపాలక సంఘం ,గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీగ్యాన్ ప్రతిష్ట చౌటుప్పల్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రోజున ఉదయం 9 గంటలకు గాంధీ పార్కు నందు గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలపారు. ఈ కార్యక్రమంలో ఒక ఫీట్ ఎత్తుగల గాంధీజీ 500 విగ్రహాల ఏర్పాటు, 100 చేరకాల ప్రదర్శన, 500 మందితో బాల గాంధీ ల వేషధారణ , గాంధీ ఫోటో గ్యాలరీ, ఎద్దు గానుగ ,గాంధీ విజ్ఞానానికి సంబంధిత ప్రదర్శనలు ,సాంస్కృతిక కార్యక్రమాలు .గోపూజ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీపీ కృష్ణారావు ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్ రెడ్డి ,మహిళా కన్వీనర్ యానాల రాధిక ,గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చౌటుప్పల్ మండల అధ్యక్ష కార్యదర్శులు వెన్ రెడ్డి సంధ్య, డాక్టర్ ఉజ్జిని మంజుల ,కోశాధికారి పోలోజు శ్రీలత ,ఉపాధ్యక్షులు బొబ్బిలి సంధ్య ,మురళి ,వనం మమత, భవాని, ర%ఝ%్లనీస్ర బద్దం స్వప్న,సువర్ణ లక్ష్మి, మునుకుంట్ల పద్మావతి, షామిని, లక్ష్మి, విజయ, కీర్తన,చందన, సంధ్యా, నికిత, తదితరులు పాల్గొన్నారు

### పేద ప్రజల సంక్షేమం కోసమే
# ప్రభుత్వ పథకాలు

- **గ్రామ, వార్డు సభలను సద్వినియోగం చేసుకోండి**
- **ప్రతిష్టాత్మకంగా 26 నుంచి నాలుగు ప్రభుత్వ పథకాలు**
- **నూతన రేషన్ కార్డుల అమలుకు శ్రీకారం**
- **ప్రజా ప్రభుత్వంలో దళారి వ్యవస్థకు అవకాశం లేదు**
- **దరఖాస్తుల స్వీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి**
- **కల్వకుర్తి నియోజకవర్గం అమనగల్**
- **మార్కెట్ కమిటీ చైర్పర్సన్ యాట గీత నరసింహ ముదిరాజ్**



**మహేశ్వరం, జనవరి 22 (నినాదం న్యూస్):**ఈనెల 26న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే నాలుగు ప్రభుత్వ పథకాలను కల్వకుర్తి నియోజకవర్గంలోని అమన గల్ లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని, అలాగే ప్రభుత్వ పథకాలకు సంబంధించి దళారి వ్యవస్థ ఉండబోదని, ప్రజా ప్రభుత్వంలో పథకాల అమలు పేరిట ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వారిపట్ల కఠినమైన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గం అమనగల్ కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. గత కొద్ది సంవత్సరాలుగా జారికాని కొత్త రేషన్ కార్డులు ఈనెల 26 నుండి జారీ అవుతాయని ఈ నాలుగు ప్రభుత్వ పథకాలకు సంబంధించి మంగళవారం రోజున ప్రతి గ్రామంలో గ్రామ సభలు, నియోజకవర్గం పరిధిలో వార్డు సభలు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇదివరకు పేర్లు నమోదు కానీ వారు అధికారులు గ్రామానికి, వార్డుకు వచ్చినప్పుడు వారికి సంబంధించిన పత్రాలను లబ్దిదారులు అందించి మరల నమోదు చేసుకోవాలని సూచించారు. నాలుగు ప్రభుత్వ పథకాల్లో భాగంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళు , ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం, రైతు భరోసా పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు సహాయం చేయాలని కోరారు.

# సంక్షేమ పథకాలలో అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి

- **గ్రామసభల్లో అధికారులకు సహకరించండి**
- **లిస్టులో పేరు రాకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**
- **అర్హులైన ప్రతి ఒక్కరు మళ్ళీ దరఖాస్తు చేసుకోండి**
- **నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**
- **కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భారత్ గోర్**



**మహేశ్వరం, జనవరి 22 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహాలు రేషన్ కార్డులు ఇందిరమ్మ భరోసా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ, వార్డు సభలో అధికారులకు సహకరిస్తూ దరఖాస్తులు చేసుకోవాలని కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భారత్ గోర్ బంజారా సేవ సమితి చైర్మన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులు ప్రకటించిన లిస్టులో పేరు రాకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ లిస్టు ఫైనల్ కాదని లిస్టులో పేరు లేని అర్హులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఆందోళన చెందాల్సిన అవసరం ఏమాత్రం లేదని ఆయన తెలిపారు.కావాలనికొంతమందిప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని నిజమైన అర్హులను ప్రభుత్వం గుర్తించి తప్పకుండా వారికి న్యాయం చేస్తుందని ఆయన తెలిపారు. ఒక నియోజకవర్గానికి మొదటి విడత 3 వేల ఇండ్లను ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందేనని అందులో భాగంగా ప్రతి గ్రామం నుండి మొదటి విడుదల 10 నుండి 20 వరకు ఇండ్లను మంజూరు చేసే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఉదాహరణకు ఒక గ్రామంలో అర్హులైన జాబితా 200 మంది ఉంటే ఒకేసారి అందరికీ ఇండ్లు మంజూరు కావని విడతలవారీగా వారికి ఇండ్లకు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు. లిస్టులో పేరు రానంత మాత్రాన వాళ్లు అనర్హులు కాదని మళ్లీ దరఖాస్తు చేసుకుంటే ఖచ్చితంగా వారికి న్యాయం జరుగుతుందని డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్ తెలిపారు. ప్రజా పాలనలో అవినీతికి ఆస్కారం ఉండదని అర్హులైన ప్రతి ఒక్కరికి అధికారులు న్యాయం చేస్తారని ఎక్కడైనా అన్యాయం జరిగితే తన దృష్టికి తీసుకురావాలని ఈ విషయంపై స్థానిక కాంగ్రెస్ నేతలు నాయకులు కార్యకర్తలు లబ్దిదారులకు అండగా ఉండి వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. లబ్దిదారుల ఎంపికలో ఎలాంటి పైరవీలకు తావు లేదని ఎవరిని నమ్మి మోసపోవద్దని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రతి పథకాన్ని అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. రెండవ రోజు మొదలైన గ్రామ వార్డు సభల్లో అక్కడక్కడ చిన్నచిన్న గందరగోళాలు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని వాటిని భూతద్దంలో పెట్టి చూడాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని ఎవరో ఏదో చెప్పారని ఆందోళన చేస్తే నష్టపోయేది మీరే అని ఆయన తెలిపారు.

# గ్రామ సభలో గందరగోళం...









**కొల్చారం జనవరి 22 (నినాదం న్యూస్)** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకోవడంలో అధికారుల విఫలమవుతున్నారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చెందకుండా పేదవారి కష్టం ఉన్నవారికి దోచి పెట్టే విధంగా ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నారని కొంగోడు గ్రామ ప్రజలు వాపోయారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం లోని కొంగోడు, నైన్ లాల్పూర్, పోతిరెడ్డిపల్లి, రాంపూర్, వరిగుంతం , అప్పాజీపల్లి , గ్రామాలలో బుధవారం అధికారుల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించారు. కొంగోడు గ్రామసభకు డిప్యూటీ తహసిల్దార్ నాగవర్ధన్ ప్రత్యేక అధికారిగా హాజరవగా, నైన్ జలాల్పూర్ గ్రామ సభకు మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి, ఏపీవో మహిపాల్ రెడ్డి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. పథకాలకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ జాబితాలో తమ పేర్లు కనిపించకపోవడంతో అసంతృప్తికి లోనైనా పలువురు అధికారులను సభాముఖంగా నిలదీశారు. కొంగోడు గ్రామానికి చెందిన చాకలి మంజుల మాట్లాడుతూ....ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇల్లు మంజూరు చేస్తామని చెప్పి ఇప్పుడు జాబితాలో తమ పేరు లేదంటున్నారని వాపోయారు. ఇదేవిధంగా నైన్ జలాల్పూర్ లో లంబాడి కున్య తనకు బోరు లేదు, భూమి లేదు అయినప్పటికీ తనను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎందుకు ఎంపిక చేయలేదని ప్రశ్నించారు. అనంతరం కొంగోడు మాజీ సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో చెప్పింది ఒకటి చేస్తున్నది ఒకటి అని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటికీ చేయలేదన్నారు.

# సంచార పశు వైద్య సేవలను వినియోగించుకోవాలి

- **ఎంవిసి రాష్ట్ర ప్రాజెక్టు అధికారి భగీష్ మిశ్రా**
- **పశు వైద్య వాహనాన్ని తనిఖీ చేసిన ప్రాజెక్ట్ అధికారి**



**చేవెళ్ల జనవరి 22(నినాదం న్యూస్):**పాడి రైతులు సంచార పశు వైద్య సేవలను వినియోగించుకోవాలని ఎంవిసి ప్రాజెక్టు అధికారి భగీస్ మిశ్రా సూచించారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలో సంచార పశు వైద్య సేవల వాహనాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గం లోని పశు పోషకులు సంచార వాహనాన్ని సద్వినియోగం చేసుకోని పశువుల ఆరోగ్యాన్ని పశు సంపదను పెంచుకోవాలని కోరారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని రైతులకు ఎప్పటికీ అందుబాటులో ఉంటూ పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంచార పశు వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, డిస్టిక్ ఇన్చార్జి రాజబాబు, ఎంవిసి సిబ్బంది డాక్టర్ మనీషా, రాజు సిబ్బంది అన్నారు.

# టాస్క్ ఆధ్వర్యంలో ఉద్యోగ నియామక పత్రాలు అందజేత







**మహేశ్వరం, జనవరి 22 ( నినాదం న్యూస్):** టాస్క్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణతరగతుల ద్వారా ప్రముఖ యూబీఎస్ కంపెనీలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు టాస్క్- సిఇఓ శ్రీకాంత్ సిన్హా, సీఓఓ సుంకిరెడ్డి రాఘవేంద్రరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. 300 మంది ఈడబ్ల్యూఎస్ కేటగిరి విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రక్రియలో ఎంపికైన 63 మంది విద్యార్థులకు బుధవారం టాస్క్ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టీఏఎస్ కే) ఆధ్వర్యంలో రెండు నెలల పాటు దాదాపు 300 మంది ఈడబ్ల్యూఎస్ కేటగిరి విద్యార్థులకు టెక్నికల్, సాఫ్ట్ స్కిల్ విభాగాలలో శిక్షణ తరగతులు నిర్వహణ తర్వాత ప్రముఖ యూబీఎస్ కంపెనీ వారు నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రక్రియ ద్వారా నైపుణ్యం కల్గిన 63 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి ఆరు లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ భద్రత అనేది అందరీ సమిష్టి బాధ్యత..

## ప్రతి ఒక్కరు భాగస్వాములుకావాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





**మెదక్ ప్రతినిధి జనవరి 22 (నినాదం న్యూస్)** బుధవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో మెదక్ జూనియర్ కళాశాలలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు అనంతరం ర్యాలిని కలెక్టర్ రాహుల్ రాజ్ ఎస్పీ, ఉదయకుమార్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.మెదక్ కలెక్టరు రాహుల్ రాజ్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి... రోడ్ భద్రత నియమాలు సంబంధించి ప్లా కార్డులు పట్టుకుని జూనియర్ కళాశాల నుండి రాందాస్ చౌరస్తా వరకు భారీ ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రమాదాల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై "ట్రాఫిక్ నిబంధనలు పాటించండి ప్రమాదాలను అరికట్టండి" "హెల్మెంట్ ధరించడం మన ప్రాణానికి ఎంతో రక్షణ" విద్యార్థినీ విద్యార్థుల నినాదాలతో పురవీధులు మారుమోగాయి, ర్యాలీ ప్రజల్లో చైతన్య దిశగా కొనసాగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలి,ప్రాణం చాలా విలువైనదని రోడ్ భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు... మోటార్ సైకిల్ మీద ప్రయాణిచ్చే ప్రతి ఒక్కరు తప్పకుండ హెల్మెట్ ను ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, ఓవర్ స్పీడింగ్ మరియు ఓవర్ టేకింగ్ చెయ్యరాదనిచెప్పారు.తల్లితండ్రుల చేతుల్లో విద్యార్థుల భవిషత్తు ఉంటుంది అన్నారు.మీ తల్లిదండ్రులకు బైక్ నడిపే టప్పుడు హెల్మెట్ పెట్టుకోవాలని విద్యార్థులు చెప్పాలని కోరారు.రోడ్ భద్రత నియమాలు ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి వివిధ పాఠ్యాంశంగా చేర్చారని చెప్పారు. ట్రాఫిక్ రూల్స్ ప్రకారం కచ్చితంగా లెఫ్ట్ సైడ్ నుండి వెళ్ళాలని కోరారు..వాహన దారులుట్రాఫిక్ సిగ్నల్ పాటించకుండా జంప్ చేస్తున్నారని దానీ వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు....సినిమాలో మాదిరిగా యువకులు స్ట%శీ%ట్స్ వేస్తూ బైక్ విన్యాసాలు చేయద్దు అన్నారు.. సినిమా కేవలం వినోదం కోసమేనని భావించాలని చెప్పారు.ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యుద్ధంలో మరణించిన దానీ కంటే కూడా రోడ్ ప్రమాదాలలో మరణించే వారి సంఖ్య ఎక్కువ ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు..స్టూడెంట్ లైఫ్ నుండి రోడ్ భద్రత నియమాలు పాటించాలని కోరారు.రోడ్ ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే హాస్పిటల్ తరలించాలని కోరారు... స్కూల్ లో పాఠాలు నేర్చుకునేటప్పుడే రోడ్డు భద్రత నియమాలు నేర్చుకోవాలని కోరారు . పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాల కోసం అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా 20% మరణాలు జిల్లాలు తగ్గాయి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్. వెంకటస్వామి, ఆర్ అండ్ బి ఈసర్దార్ సింగ్ డీఎస్పీ ప్రసన్నకుమార్,, ఎం.ఈ.ఓ నీలకంఠం, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు శ్రీలేఖ, శ్రీనివాస్ సంబంధిత అధికారులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 25న సంగారెడ్డిలో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయండి

## కీలు కానీ లక్ష్మణ్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు




**కుత్బుల్లాపూర్, జనవరి 22 (నినాదం న్యూస్)** సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని 25న బహిరంగ సభ జరుగుతుందని అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బుధవారం సూరారం డివిజన్ షాపూర్ నగర్ లో పార్టీ కార్యాలయం వద్ద సిపిఎం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ సిపిఎం ప్రజా కార్మిక పేదల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పేదల ఇల్లు ఇళ్ల స్థలాల కోసం అర్హులైన వాళ్ళ పెన్షన్ల కోసం కార్మిక హక్కులు కార్మిక చట్టాలు రక్షణకై ఉద్యమాలు కొనసా గిస్తుందని అన్నారు. సిపిఐఎం జాతీయ గుర్తింపు కలిగి నిరంతరం పేదలు, కార్మికుల, ఉద్యోగుల, కష్టజీవుల హక్కుల కోసం పోరాడుతూ ప్రజాస్వామ్యం, లౌకిక విధానం, సామాజిక న్యాయం కోసం అంకిత భావంతో ఉద్యమిస్తూనామన్నారు.ఎన్నికల సమయంలో అధికారం కోసం ఉచిత వాగ్దానాలు చేస్తూ గెలిచాక ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక కాలయాపన చేయడం అమానుషం అన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రజల దగ్గర నుండి దరఖాస్తులు తీసుకొని వాటి పరిశీలన పేరు తో రెండు, మూడు సంవత్స రాలపాటు కాలం గడుపుతూ వచ్చిన దరఖా స్తులలో కనీసం 10 శాతం కూడా ప్రజలకు లబ్ధి చేకూరడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన పార్టీ కచ్చితంగా అమలు చేయాలని, అమలు చేయని పక్షంలో దరఖాస్తు దారులను సమీకరించి హామీల అమలుకై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలోని ఆర్థిక సామాజిక అంశాలు, కార్మిక, కర్షక, పేదలు, మహిళలు, ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్క రించే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుంద´న్నారు. కేంద్ర ప్రభుత్వం గత 10సంవత్సరాలుగా అనుసరిస్తున్న నయా ఉదా రవాద ఆర్థిక విధానాలు, పారిశ్రామి కరంగాన్ని, వ్యవసాయరంగాన్ని దివాలా తీయించాయని వాపోయారు. విద్య, వైద్యం, ఉద్యోగం సామాన్యులకు అందని ద్రాక్షలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాష్ట్ర మహాసభల్లో అనేక ప్రజా సమస్యలపై చర్చించి దిశా నిర్దేశం చేయడం జరుగుతుందని ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపుని చ్చారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సిపిఎం మండల కమిటీ సభ్యులు బి సత్యం, పార్టీ సీనియర్ నాయకులు జి వెంకన్న, ఆంజనేయులు, సునీల్, బీరయ్య, నర్సింగ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో మరమ్మతు పనులు

# వేగవంతం చేయండి

**-వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**కొడంగల్ నినాదం:** కొడంగల్ మండలంలోని ప్రభుత్వ బీసీ, ఎస్సి, బాలుర వసతి గృహాలను, మరియు నర్సింగ్ కళాశాల వసతి గృహాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వసతి గృహాల పరిసరాలను, గదులను పరిశీలించారు. వసతి గృహాలో జరుగుతున్నా మరమ్మత్తు పనులను పరిశీలించారు.వసతి గృహాలు మరమ్మత్తు పనులు చేయించేందుకు కావలసిన నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ తెలిపారు. సాంఘిక సంక్షేమ వసతిగృహం లో మ్యాట్రాస్ ను అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా వసతి గృహాలకు నాణ్యమైన కలర్ తో కూడిన వాల్ పెయింటింగ్ వేయించాలని, పెద్ద లైట్స్ ఏర్పాటు చేయాలనీ అధికారులకు సూచించారు.ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు కడ అధికారి వెంకట్ రెడ్డి తహసిల్దార్ విజయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్,నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరీ,వసతి గృహాల సంక్షేమ అధికారులు ఉన్నారు.

# ఇష్టాను సారంగంగా మున్సిపాలిటీలో గ్రామాల విలీనం

**చేవెళ్ల రెవెన్యూలో ఉన్న గ్రామాలను వదిలేసి,దూరంగా గ్రామాలను కలపడంలో ఆంతర్యం ఏమిటి?**

**రాజకీయ స్వలాభం కోసం నిర్ణయాలు, ఉపాధి కోల్పోనున్న ప్రజలు**

**సమావేశంలో చేవెళ్ల బిజెపి మండల అధ్యక్షులు అత్తే అనంతరెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్ రెడ్డి**



**చేవెళ్ల జనవరి22(నినాదం న్యూస్):** మున్సిపాలిటీలో గ్రామాల వెళ్లిన ప్రక్రియ ప్రజాభిప్రాయ సేకరణ మేరకే జరగాలని చేవెళ్ల బీజేపీ మండల అధ్యక్షుడు అతేల్లి అనంతరెడ్డి, డాక్టర్ వైబావ్ రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో బిజెపి నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షులు అత్తేలి అనంతరెడ్డి, డాక్టర్ వైబావ్ రెడ్డి మాట్లాడుతూ... చేవెళ్ల నూతన మున్సిపాలిటీ ఏర్పాటు జరుగుతుందని గత కొన్ని నెలలుగా మండలంలో జోరు ప్రచారం కొనసాగుతున్న విషయం అందరికీ తెలిసిందే.చేవెళ్ల రెవెన్యూ కు అనుకొని ఉన్న గ్రామాలు మున్సిపాలిటీలో కలుస్తాయని ఆయా గ్రామాల ప్రజలకు కూడా తెలిసిన విషయమే.అయితే ఈమధ్య రాజకీయ నాయకులు వారి వారి స్వలాభాల కోసం చేవెళ్ల రెవెన్యూ కు దగ్గరగా ఉన్న గ్రామాలను తీసుకోకుండా దూరంగా ఉన్న గ్రామాలను మున్సిపాలిటీలో కలుపాలనే ప్రణాళిక సిద్ధం చేశారని,ఈ నిర్ణయం ముమ్మాటికి తప్పేనని మండిపడ్డారు.ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా బడా నాయకులకు నచ్చినట్టు నిర్ణయాలు తీసుకొని కొన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులు చేసుకొని బ్రతికే వారి నోట్లో మట్టి కొడుతున్నంత పని చేస్తున్నారని,మా గ్రామాలను మున్సిపాలిటీలో కలుపొద్దని గ్రామ పెద్దలు అధికారులకు,నాయకులకు ఎన్నో అర్జీలు పెట్టుకున్న ఫలితం లేకుండా పోతుందని,చేవెళ్ల నూతన మునిసిపాలిటీలో కలిపితే 12 గ్రామాలు తప్పకుండా కలపాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో,పత్తి సత్యనారాయణ యాదవ్,అఖిల్,ప్రకాష్,భార్గవ్ రెడ్డి,భాస్కర్,ప్రవీణ్ రెడ్డి,జై సింహ రెడ్డి,హేమంత్,తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి మండల అధ్యక్షునికి సన్మానం



**చేవెళ్ల జనవరి 22 (నినాదం న్యూస్):** చేవెళ్ల మండల బిజేపి అధ్యక్షుడుగా ఎన్నికైన ఆత్తెల్లి అనంత్ రెడ్డిని యువ నాయకులు డాక్టర్ వైభవ్ రెడ్డి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేగురి ప్రవీణ్ రెడ్డి,పిసరి శ్రీకాంత్ రెడ్డి ,పత్తి సత్యనారాయణ ,మల్గారి భార్గవ్ రెడ్డి,ప్రకాష్,జయసింహ,హేమంత్ ,భాస్కర్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ముంగిట్లో సంక్షేమ పథకాలు...

## పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు...

**పెద్దపల్లి,జనవరి22(నినాదం)** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటనే అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు.బుదవారం కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన జనవరి 26 నుండి అమలు చేసే రైతుభరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,ఇందిరమ్మ ఇండ్లు నాలుగు సంక్షేమ పథకాల అమలు కార్యక్రమంలో భాగంగా గ్రామ సభకు ముఖ్య అతిధిగా హాజరైన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కరెంటు బిల్లులు కట్టలేక ఇబ్బంది పడ్డ ప్రజలకు 200 యూనిట్ల విద్యుత్ మాఫీ చేసి సుమారు 80 శాతం మంది ప్రజలు కట్టే విద్యుత్ బిల్లు ప్రభుత్వం భరిస్తుంది అని అన్నారు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు రాక ప్రజలందరికీ ఎంతో ఇబ్బంది పడ్డారని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి రేషన్ కార్డులు ఇచ్చారని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులు లేని వారందరికీ సీఎం రేవంత్ రెడ్డి ఇవ్వడం జరుగుతుంది అన్నారు. ఇల్లు లేని వారికి సొంత ఇంటి స్థలం ఉంటే 5 లక్షలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు కట్టించడం జరుగుతుంది అన్నారు. మండల కేంద్రంలో ఉన్న 278 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇక్కడ ఇల్లు లేని వారందరికీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నియోజకవర్గానికి ప్రతి సంవత్సరానికి 3500 ఇండ్లు మంజూరు కావడం జరుగుతుందని నాలుగు సంవత్సరాలుగా దశలవారీగా ఇండ్లు లేని వారందరికీ ఇవ్వడం జరుగుతుంది అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ



ఆత్మీయ భరోసా ఈ నాలుగు సంక్షేమ పథకాలు ఎలాంటి అవినీతికి తావు లేకుండా ఎంపిక చేయడం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్నప్పుడు చేసిన వాగ్దానాలన్నీ అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చడం జరుగుతుంది అన్నారు. భూమిలేని నిరుపేదలందరూ ఉపాధి హామీలో సంవత్సరానికి 20 రోజుల పని దినాలు చేసి ఉంటే వారికి ప్రభుత్వం ఆరు నెలకు 6000 చొప్పున 12000 ఇవ్వడం జరుగుతుంది అన్నారు. గత ప్రభుత్వంలో ఈనియోజకవ ర్గంలో రైతులు పండించిన వడ్లకు ఐదు కిలోల నుంచి 20 కిలోల వరకు క్వింటాలకు కట్ చేసి రైతులను నిలువున ముంచింది అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ నియోజకవర్గంలో రెండు పంటల వరి ధాన్యముకు గింజ కటింగు లేకుండా కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేయించి రైతులనుఆదుకున్నానని అన్నారు.గత ప్రభుత్వం అధికారంలో ఉండి ఈ రాష్ట్రంలో ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేసిందని, ఈ అప్పు భారాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రజల మీద ఎలాంటి పన్ను వేయకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాడు అన్నాడు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ కష్టపడుతున్నాడని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా సారయ్య గౌడ్ ను సభాముఖంగా అభినందించారు. ఎస్సారెస్పీ కాలువ కు మరమతుల చేసేందుకు 49 లక్షలు ప్రతిపాదనలు చేయడం జరిగిందని కాల్వ షటర్ కోసం 29 లక్షలు కూడా మంజూరికి మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి కానుకూలంగా స్పందించారని, ఈ మరమ్మతులు పూర్తయితే 200 క్యూసెక్కుల నీరు ఎస్సారెస్పీ కాల్వ ద్వారా హెూస్సేన్ మియా వాగులోకి కేవలం మూడు రోజుల్లోనే వచ్చి పెద్దరాతుపల్లి వరకు సాగునీరు అందుతుందన్నారు. మేము ప్రజా పాలకులను కాదు సేవకులమని ఎప్పుడు ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీ మాల, ఎంపీడీవో రామ్మోహనాచారి, తహసిల్దార్ ఎండి వకీల్, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, గజానావేణి సదయ్య, తులా మనోహర్ రావు,సబ్బని రాజమల్లు,అల్లం దేవేందర్, పులి ఇంద్ర కర్ణన్ రెడ్డి,బంగారి రమేష్, మాధను సతీష్, రానవేనా శ్రీనివాస్,సోనాయిటెంకం శివ,రావి సాధనందం, క్రాంతి, మరియు ఎంపీ ఓ కిరణ్ గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే రోడ్డు నియమాలు తెలుకోవాలి

## రోడ్డు భద్రతా వారోత్స వాల్లో.. సీఐ భూపాల్ శ్రీధర్.



**చేవెళ్ల జనవరి 22( నినాదం న్యూస్):** రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రైవేటు స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ భూపాల్ శ్రీధర్ విద్యార్థి దశ నుంచి రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించినట్లయితే సురక్షితంగా తమ గమ్యస్థానాలను చేరుకోవచ్చు అని అన్నారు. అలాగే రోడ్డు ప్రమాదంలో ఎవరైనా గాయపడితే వారి పట్ల సేవ గుణంతో వారికి సహాయం చేయాలనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ పురన్ దాస్ ప్రధానోపాధ్యాయులు మెహరునిష భేగం,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీ ఈ టి లు, జడ్పీహెచ్ఎస్ స్కూల్, మోడల్ స్కూల్ వివేకానంద స్కూల్ శ్రీ సత్య సాయి స్కూల్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# వ్యవసాయ మార్కెట్ దశ మారేనా...!

- **నూతన పాలకవర్గానికి సమస్యల స్వాగతం...!**
- **కోట్లలో ఆదాయ మున్నా.. అభివృద్ధి అంతంత మాత్రమే..!**
- **అక్రమార్కులకు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా సంత...?**
- **అధిగమించి అభివృద్ధి చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్న నియోజకవర్గ ప్రజలు...**
- **మంత్రులు ఉత్తమ్ ,తుమ్మల ఎమ్మెల్యే పద్మావతిల సమక్షంలో నేడు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం...**

**కోదాడ. జనవరి 22 (నినాదం న్యూస్)** :అంగట్లో అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని ఉన్నట్లు అనే సామెత కోదాడ వ్యవసాయ మార్కెట్ కు సరిగ్గా సరిపోతుంది... సారసరి ఆరు కోట్లకు పైగా ఆదాయం ఉన్నప్పటికి కనీస వసతులు కరువైయ్యాయి. గత రెండు సంవత్సరాలుగా పాలకవర్గం లేకపోవటంతో పర్యవేక్షణ లోపంతో సదరు సమస్యలు మరింత తీవ్రస్థాయికి చేరుకొన్నాయి. దీంతో పాటు కోదాడ పట్టణ నడిఒడ్డునే మార్కెట్ కమిటీ కార్యాలయంకు ఆనుకొని పశువుల సంతతో మురికి కూపంగా మారి ప్రజలకు మరింత ఇబ్బందిగా మారింది. నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గానికి ఈ సమస్యల పరిష్కారం పెను సవాలుగా మారిందని చెప్పవచ్చు.




### అల్లుడి నోట్లో శని ఉన్న చందంగా...

కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంతలో పశువుల అమ్మకం, కొనుగోలుతో పాటు ఈప్రాంతంలో విస్తారంగా ఉన్న మిల్లుల నుంచి వసూలు అయ్యే సెస్సుల ద్వారా దాదాపు 8కోట్లకు పైగా ఆదాయం లభిస్తుంది. అయితే సదరు మిల్లులపై మార్కెట్ కమిటీ పాలకవర్గం పర్యవేక్షణ లేకపోవటంతో తమకు వచ్చే ధాన్యాన్ని తక్కువ చూపించి వారు చెల్లించే రుసుము తక్కువ జమ చేస్తున్నారని ఆరోపణలపై నూతన పాలకవర్గం దృష్టి పెడితే పదికోట్లకు పైగా ఆదాయం సమకూరే వెసులుబాటు ఉంది.

### పశువుల సంతతోనూ అదే దుస్థితి.... ఆక్రమాలకు అడ్డాగా...?

ఉమ్మడి ఆంధ్రప్రదేశలో రెండవ అతి పెద్ద పశువుల సంతగా పేరుంది. ప్రతి ఆదివారం ఈ సంత నుంచి వేలాది పశువులు, మేకలు, గొర్రెలు, ఆవుల క్రయ, విక్రయాలు జరుగుతాయి. ఇక్కడ నుండి ఈ పశువులు రెండు, మూడు రాష్ట్రాలకు కూడా తరలిస్తుంటారు అయితే కమిటీ పర్యవేక్షణ లేకపోవటంతో సంత బయటనే ఆక్రమణ పద్ధతిలో క్రయ విక్రయాలు జరుగుతుండటంతో కమిటీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతుందని చెప్పవచ్చు. దీంతో పాటు ఈ సంతలో కొంతమంది అక్రమ వ్యాపారులు చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తమ ఇండ్లలో ఉండాల్సిన పశువులను ఇక్కడే పెంచి పోషించటంతో పాటు మార్కెట్ నిబంధనల విరుద్ధంగా క్రయ, విక్రయాలు చేస్తున్నట్లు పలుమార్లు రూఢీ అయింది. దీంతో పాటు ఈ సంతను అసాంఘిక కార్యక్రమాలకు నెలలుగా మారిందని, ఇక్కడ జూదం కూడా నడుస్తుండటంతో పలుమార్లు పోలీసులు కేసులు బనాయించిన సంఘటనలు కూడా ఉన్నాయి.

### పాలకవర్గం సహకారంతో సమస్యలు పరిష్కారం...

**- వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఏపూరి తిరుపతమ్మ సుధీర్ చైర్పర్సన్ :**



పాలకవర్గం సహకారంతో మార్కెట్ పరిధిలోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తా... దీంతో పాటు సంతలో తిష్ట వేసిన సమస్యలను కూడా అవగాహన చేసుకొని పరిష్కరిస్తాను .రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో మరిన్ని నిధులను సమకూర్చి అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేస్తాను. ఇందుకు పాలకవర్గ సభ్యులతో పాటు ప్రజాపతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

### సంతను బాలాజీ నగర్ కు మారిస్తే మరింత ప్రయోజనం

కోదాడ నడిబొడ్డున ఉన్న సంతతో ప్రజలకు ఇబ్బందిగా మారినందున గతంలో బాలాజీనగరిని పది ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసేందుకు సర్వేలు కూడా నిర్వహించారు. అయితే ఈ తంతు మధ్యలోనే ఆగిపోయింది .ప్రస్తుత పాలకవర్గం ఈ అంశంపై దృష్టిసారించి సంతను అక్కడికి మారిస్తే రైతులకు, ప్రజలకు ఇబ్బంది తొలుగుతుంది. దీంతో పాటు శిధిలావస్థకు చేరుకున్న గోదాములను, షెడ్లను మరమ్మత్తులు చేసి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే రైతులకు వెసులుబాటుగా ఉంటుంది. ఇక కోదాడ పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా మాంసం, చేపలు, విక్రయాలు జరుగుతు న్నాయి.దీంతోపాటు కూరగాయల మార్కెట్ కూడా ఇరుక్కుగా ఉండటంతో ఇబ్బందిగా మారింది .ఈ సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వల మార్కెట్ కమిటీ వెనుక భాగాన 9 కోట్లతో సమీకృత మార్కెట్ దుకాణాల సముదాయానికి శంకు స్థాపన చేయటంతో పాటు కొంతమేరకు నిర్మాణం జరిగింది. అయితే ఈ నిర్మాణాన్ని పూర్తిచేస్తే ప్రజలు ఇక్కడే మాంసం, కూరగాయల విక్రయాలకు వెసులుబాటు కలుగుతుంది. పదికోట్లకు పెంచుకుంటే నియోజకవర్గంలో అంతర్గత రహదారులను కూడా నిర్మించవచ్చు. నూతన పాలకవర్గం ఈ సమస్యలను పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.